సమాచారం

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు


పాస్టర్ జాయ్

చిలకలగూడ : హోసన్నా పెంతికోస్తు ఫెయిత్ మిని స్ట్రీస్ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో నేటి (మంగళవారం) నుంచి మూడ్రోజుల పాటు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఫాస్టర్ జాయ్ తెలిపారు. పాస్టర్ డేవిడ్‌రాజ్, రెబకమ్మ దంపతులు 56 సంవత్సరాల క్రితం చిలకలగూడలో హోసన్నా పెంతికోస్తు మినిస్ట్రీస్‌ను స్థాపించి విశ్వశాంతి కోసం అనేక సమావేశాలు, సభలు నిర్వహించారని, వారి అడుగుజాడల్లో నడుస్తూ ఆశయాల సాధన కోసం తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచ మానవాళి రక్షణ, మత విశ్వాసులకు దీవెనలు అందించేందుకు నిర్వహించే స్వస్థత సభలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు చిలకలగూడ మైదానంలో ప్రారంభమవుతాయని సంఘ కాపరులు, పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఫాస్టర్ జెబ్‌రాజ్ (హైదరాబాద్), ఫాస్టర్ జాకబ్‌ఛార్లెస్ (విజయవాడ), ఫాస్టర్ మాథ్యూస్ (గుంటూరు) ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బౌద్ధనగర్: స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. సోమవారం జలమండలి సెక్షన్ మేనేజర్ ప్రియాంకతో కలిసి ఆమె అంబర్‌నగర్, బౌద్ధనగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఉన్నటువంటి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే ప్రజలు కూడా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్ వెంట సుజాత, జగదీష్, పర్వతాలు, సాయి యాదవ్, క్రాంతి, సమీర్ ఉన్నారు.

బస్తీ అభివృద్ధికి నిరంతర కృషి

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లో సోమవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్ల నిర్మాణం, నాలాల విస్తరణ, పవర్ బోర్ల మరమ్మతులు వంటి పలు సమస్యలు బస్తీ వాసులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. మాణికేశ్వర్‌నగర్‌లోని సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. మోతే శోభన్‌రెడ్డి, వెంకటేష్, నాగేశ్వర్‌రావు, శ్యామ్, కృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజును తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భారీగా పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు సోమవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం ఇచ్చారు.

స్నేహశీలి ప్రొ.అన్సారీ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధ్యాపకులు ప్రొ.అన్సారీ స్నేహశీలి అని పలువురు వక్తలు కొనియాడారు. అన్సారీ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో జరిగిన వీడ్కోలు సమావేశానికి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు జి.రాములు, అరుణోదయ విమలక్క, సిద్ధార్థ విద్యా సంస్థల యజమాని డాక్టర్ నాగయ్య, టీజేఎస్ నేత సలీంపాషా తదితరులు పాల్గొని ప్రొ.అన్సారీని సన్మానించారు.

నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగాలకు కొదవ లేదు

సనత్‌నగర్: యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి ఉద్యోగ అవకాశాలను మరింతగా మెరుగుపరిచేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్ స్పష్టం చేశారు. జెక్‌కాలనీలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ప్రాంగణంలో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్, ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యం ఉండే యువతకు ఉద్యోగ అవకాశాలకు కొదవ లేదన్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు తమ విభాగం కృషి చేస్తోందన్నారు. అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు 40 బహుళజాతి సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 400 మంది హాజరవ్వగా 240 మంది ఉద్యోగవకాశాలు పొందినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సయ్య, ఐఎంసీ చైర్మన్ కృష్ణజియా పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


రోడ్డు పనులను ప్రారంభించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో రహదారుల సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే రోడ్ల పరిస్థితి ఎంతో మెరుగుపడిందన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఆధునిక సీసీ రోడ్లను వేయించడం జరిగిందని తెలిపారు. ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతకు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పద్మారావునగర్ వెంకటాపురం కాలనీలో వేర్వేరు చోట్ల రూ. 70 లక్షలతో వేయనున్న వీడీసీసీ రోడ్డు పనులు, బండమైసమ్మనగర్‌లో రూ. 28.5 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ పనులను ప్రారంభించారు. బస్తీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్ గౌడ్, బాల్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

బన్సీలాల్‌పేట్: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మోండా మార్కెట్ ఆదయ్యనగర్ గ్రౌండ్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని రాష్ట్ర ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తోందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం గొప్ప కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. దళిత బంధు కార్యక్రమం దళిత వర్గాలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. నియోజకవర్గంలో గతంలో 100 మందికి దళిత బంధువు ఎంపిక చేస్తే ఈసారి 1100 మంది అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం దళారులను ఆశ్రయించొద్దని నే రుగా సంబంధిత అధికారులను సంప్రదించాలన్నా రు. కొందరు మతం పేరిట ప్రజల్లో వైషమ్యాలు సృష్టిస్తున్నారని అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్పొరేటర్లు హేమలత, లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరీ, మా జీ కార్పొరేటర్లు ఆకుల రూప, అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు హరిక్రిష్ణ, నాగులు, జయరాజ్ పాల్గొన్నారు.

మహిళల ప్రగతికి ప్రోత్సాహం

డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం మెట్టుగూడలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం నిర్వహించే ప్రతీ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళల సంక్షేమం కోసం సీతాఫల్‌మండిలో ఏర్పాటు చేసిన సెట్విన్ శిక్షణ కేంద్రం ద్వారా ఇంటిపట్టున ఉండే పలువురు మహిళలు ఉపాధి అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. మహిళా పొదుపు సంఘాలకు మరిన్ని రుణాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, బీఆర్‌ఎస్ మహిళా ప్రతినిధులు పోచమ్మ, సరళ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి


నియామక పత్రం అందుకుంటున్న మహేష్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ అచ్యుత రమేష్ బాబు, నాయకులు చంద్రశేఖర్, చిరంజీవి చేతుల మీదుగా సోమవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పని చేస్తానన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఉద్యమించనున్నట్లు తెలిపారు.

ఓయూలో గ్రూప్-1 అర్హత అభ్యర్థుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కొందరు తప్పుచేస్తే పరీక్షను రద్దు చేసి అందరికి శిక్ష విధించడం అన్యాయమని క్వాలీఫై అభ్యర్థులు తెలిపారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సాయంత్రం వరకు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరీక్ష రద్దుతో 25 వేల మంది క్వాలీఫైడ్ అభ్యర్థులు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష రద్దుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని లేదా మళ్లీ పరీక్షను నిర్వహించే వరకు క్వాలీఫై అభ్యర్థులకు నెలకు రూ.5 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


అద్దాలు అందజేస్తున్న హేమ

బౌద్ధనగర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సూచించారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌పీ ఆస్పత్రిలో సోమవారం ఆయన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జూన్ 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన బృందాలు ఇంటింటికీ వెళ్లి ఆయా కేంద్రాల సమాచారం ప్రజలకు అందిస్తున్నాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో 8 సెంటర్లు ఏర్పాటు చేసి, కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని పెంచుతున్నామన్నారు. ప్రస్తుతం వరకు నియోజకవర్గం పరిధిలో 33,398 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన పదకొండు వేల మందికి అద్దాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలిజిబెత్, కార్పొరేటర్ కంది శైలజ, ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ సుంకు రామ్‌చందర్ పాల్గొన్నారు.

అంధత్వరహిత తెలంగాణే లక్ష్యం

చిలకలగూడ : అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డివిజన్‌లోని కిందిబస్తీ కమ్యూనిటీహాల్లో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించి వైద్య పరీక్షలు, అద్దాల పంపిణీ అంశాలపై చర్చించి సంబంధిత సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం పలువురి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

కంటోన్మెంట్: విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగంపేట ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు అన్నారు. ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సోమవారం మారేడ్‌పల్లిలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్, జూనియర్ కాలేజీల్లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులతో పాటు, ఇతరులకూ ప్రమాదం పొంచి ఉందన్నారు. విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్టాఫ్‌లైన్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ జ్యోతి, చక్రధర్, మాజీద్, ప్రిన్సిపల్స్ సాయి, గాయత్రి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ద్విచక్ర వాహనదారుడిపై చీటింగ్ కేసు

లాలాపేట: తార్నాకలో ఈ నెల 16న రోడ్డు దాటుతున్న మహ్మద్ మోసిన్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఓయూ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. మెట్టుగూడకు చెందిన రాజన్ (20) తన పల్సర్ బైక్‌కు ఫోర్ వీలర్ నెంబర్ (టీఎస్08 ఈఎఫ్7587)తో వినియోగిస్తున్నాడు. ఢీకొట్టిన ఘటనలో ఇప్పటికే కేసు నమోదు కాగా నెంబర్ ప్లేటు మార్చిన సంఘటనలో అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసి ఆ వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా అనే విషయాలపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్‌కు ఆరు నెలల జైలు

సికింద్రాబాద్: రైలు ప్రయాణికురాలి మెడలోంచి గొలుసు లాక్కెళ్లిన కేసులో నిందితుడికి సికింద్రాబాద్ రైల్వే కోర్టు సోమవారం 6 నెలల జైలు శిక్షను విధించింది. జీఆర్‌పీ పోలీసుల వివరాల ప్రకారం ... కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామానికి చెందిన డెగులపాటి సత్తన్న (35) ప్రైవేటు ఉద్యోగి. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు యశ్వంతాపూర్ రైలులో 2020 మార్చి 20న రితికారెడ్డి అనే యువతి ప్రయాణం చేసింది. అదే రైలులో ప్రయాణం చేసిన సత్తన్న రితికారెడ్డి మెడలోని తులం బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మెజిస్ట్రేట్ మహ్మద్‌గౌస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోజారాణిల ముందు నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో ఆరునెలల జైలుశిక్ష విధించడంతో జీఆర్‌పీ పోలీసులు మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు.

150 రీడింగ్ కుర్చీల వితరణ

రసూల్‌పురా: ఎంపీ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి నిర్వహణలో కొనసాగుతున్న ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా విద్యా ప్రోత్సాహానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి తెలిపారు. సోమవారం ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం 150 రీడింగ్ కుర్చీలను సికింద్రాబాద్ పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొ. అర్జున్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా గోనారెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ గత పదేళ్లుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. కళాశాల విద్యార్థుల కోసం ఆర్వో వాటర్ ప్లాంట్, మూడు వాటర్ కూలర్లు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల సెట్లను త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రొ. అర్జున్‌రావు మాట్లాడుతూ కళాశాలల్లో చదివే బీబీఏ విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడంతో ప్రతీక్ ఫౌండేషన్‌ను సంప్రదించామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించి రీడింగ్ కుర్చీలను వితరణ చేశారని తెలిపారు. ఎంపీ ప్రత్యేక కార్యదర్శి సైదులు, రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆరతి జాదవ్, పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

అడ్డగుట్ట: అర్హులను గుర్తించి వారికే 'డబుల్' ఇళ్లు కేటాయించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో సీపీఐ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా స్థానికంగా నివాసముంటున్న వారికి కాకుండా బీఆర్‌ఎస్ నాయకుల అండదండలు ఉన్నవారికి మాత్రమే ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. బినామీల పేరుతో దందాలు చేస్తూ అర్హులైన పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపిన తర్వాతే డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కొమరెల్లి బాబు, యాదగిరి, శంకరయ్య, రషీద్, ఖదీర్ పాల్గొన్నారు.

టీవీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లును అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు

కంటోన్మెంట్: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్ట పరమైన రక్షణలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జరిగిన తెలంగాణ వికాస సమితి జిల్లా కార్యకర్తల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బోయిన్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పరమైన హక్కులు పౌరులందరూ వినియోగించుకునేలా తన వంతు ప్రయత్నాలు చేస్తానన్నారు. టీవీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వీరారాజు, సమన్వయకర్తగా లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రకాష్, పిండిగ వెంకన్న మియాపురం రమేష్, రూబి స్టీవెన్ సన్, ఆసరి రాజు, లక్ష్మణ్,ఉత్తమ్, అజయ్ కుమార్, శ్రీనివాస చారి, సూర్యప్రకాశ్, వీరనారాయణ, నటరాజ శేఖర్ పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలంటూ రైల్వే స్టేషన్లలో ధర్నా


మాట్లాడుతున్న రన్నింగ్ స్టాఫ్


సికింద్రాబాద్‌లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సనత్‌నగర్: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ) సనత్‌నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రన్నింగ్ స్టాఫ్ సోమవారం ధర్నా నిర్వహించారు. సనత్‌నగర్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ ధర్నాలో రైల్వే ఉద్యోగులు, సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు ధర్నాలో పాల్గొనడం గమనార్హం. ఈ ధర్నాలో పాల్గొన్న సనత్‌నగర్ బ్రాంచ్ సెక్రటరీ ఢిల్లీరావు ఉప్పాడ మాట్లాడుతూ.. తాత్కాలిక లోకో పైలట్లను లోకో పైలట్లుగా, ఆల్పని సీనియర్ ఆల్ఫ్‌గా ప్రమోట్ చేయాలన్నారు. 36 గంటల్లోపు సిబ్బందిని తిరిగి హెడ్ క్వార్టర్స్‌కు తీసుకురావాలని సైన్ ఆన్, సైన్ ఆఫ్ 12 గంటల లోపు ఉండాలన్నారు. రన్నింగ్ సిబ్బందికి కనీసం 120 కిలోమీటర్ల మైలేజీని సీఎంఎస్‌లో ఉంచాలి. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక విశ్రాంతి గదులు, డైనింగ్ హాల్‌ను కేటాయించాలి. గర్భవతులను ఐదో నెల వరకు తేలికపాటి బాధ్యతలను అప్పగించాలి. ఉన్న ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ సీహెచ్.గోపీ, వైస్ చైర్మన్ సురేష్, అసిస్టెంట్ సెక్రటరీలు అరుణ్‌సింగ్ నాయక్, వెంకటేష్, బెల్లి కుమార్ యాదవ్, జగత్‌కిరణ్, కరుణ్‌కుమార్, సులేమాన్,తో ఎంటీ రెడ్డి, అనీష్‌కుమార్ పాల్గొన్నారు.


ధర్నాలో కూర్చొన్న కుటుంబ సభ్యులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో..

సికింద్రాబాద్: రైల్వేశాఖలో పనిచేస్తున్న లోకో పైలట్లు, రన్నింగ్ స్టాఫ్ సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. లోకోపైలట్లు, రన్నింగ్ స్టాఫ్‌కు పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులను ఆపాలన్నారు. క్రూ పాయింట్ నుంచి కనీసం కుటుంబ సభ్యులకు ఫోన్‌కాల్ కూడా మాట్లాడకుండా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానుసారం ఏర్పడుతున్న ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగులపై పడుతున్న పనిభారాన్ని తగ్గించాలన్నారు. కుటుంబ సమస్యలు, అవసరాల నిమిత్తం ఉద్యోగులకు సెలవులు ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను సత్వరమే పరిష్కరించకపోతే ఉద్యమాలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి రవీందర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, చిలుకు స్వామి, నరసింహారెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి మార్గాలు చూపిస్తాం

రసూల్‌పురా: శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచిత శిక్షణ తరగతులు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ తెలిపారు. సోమవారం బోర్డు ఏడవ వార్డు తిరుమలగిరి విలేజ్‌లో ఆయన పర్యటించగా విలేజ్‌లోని పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా స్థానికులు ఆయనను కోరారు. అనంతరం శ్రీ గణేష్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం స్కిల్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించి స్వయం ఉపాధి అవకాశాలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలు వార్డుల్లో కుట్టు శిక్షణ, పేపర్ ప్లేట్ల తయారీ, ఎంబ్రాయిడరీ, మెహందీ, బ్యూటీపార్లర్‌లో శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారని చెప్పారు. తిరుమలగిరి విలేజ్ మహిళల కోసం ట్రైనర్‌ను ఏర్పాటు చేస్తానని ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాన్సీ, సిండ్రెల్లా, మేరీ, భిక్షపతి, సాయి, రాజేష్, పాల్గొన్నారు.

పరీక్షా పత్రం లీకేజీపై ప్రభుత్వమే బాధ్యత వహించాలి


దీక్షలో పాల్గొన్న కార్తీకరెడ్డి, రామ్‌చందర్‌రావు

లాలాపేట: తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షా పత్రాల లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక చౌరస్తాలో నిర్వహించిన బీజేపీ నిరసన దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో పూర్తివిచారణ జరిపించాలన్నారు. నష్టపోయిన నిరుద్యోగులకు రూ.1 లక్ష చొప్పున నష్ట పరిహారం చెల్లించి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలన్నారు. దీనిపై నైతిక బాధ్యతగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దరువు ఎల్లన్న, నాగేశ్వర్‌రెడ్డి, సారంగపాణి, వీరన్న, శారదా మల్లేష్, సుక్క గణేష్ రావు, పోచయ్య, రాము వర్మ, శ్రీనివాసచారి, బండ శివారెడ్డి పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట: పరీక్షల పత్రాల లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించి రాజీనామా చేయాలని మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. పరీక్షల పత్రాల లీకేజీని నిరసిస్తూ సోమవారం అమీర్‌పేటలో చేపట్టిన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీని కూడా రద్దు చేయాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధ్యులైన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కేతినేని సరళ, సుచిత్ర, దీపిక, నేతలు పెద్ది రవి, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం



అడ్డగుట్ట: నిరుపేద కుటుంబాలకు తమవంతు సహకారంగా భవిష్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఈటల జన్మదినాన్ని పురస్కరించుకొని అడ్డగుట్టకు చెందిన భవిష్య సేవా సంస్థ చైర్మన్ నాగపూరి రాజుగౌడ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈటల చేతుల మీదుగా అడ్డగుట్టకు చెందిన 10 నిరుపేద కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. లల్లు, దిలీప్, కన్నా, శ్యామ్, రాము తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం..

బౌద్ధనగర్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బౌద్ధనగర్‌లో సోమవారం బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్ నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు పలువురు రక్తదానం చేశారు.

సంతోషం వెతికితే రాదు, సృష్టించాలి

అమీర్‌పేట: సంతోషం వెతకడం ఉండదని సృష్టించడంలో ఉంటుందని రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ అన్నారు. సోమవారం బీకే గూడ కౌన్సిల్ హాల్లో రాయల సేవా సమితి, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సంయుక్తాధ్వర్యంలో ప్రపంచ సంతోష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయోవృద్ధులు, జ్ఞాన వృద్ధులతో సంతోషంగా గడపడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మనిషి జీవితకాలంలో ఎక్కువ సమయం సంతోషంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.ప్రధానంగా వృద్ధాప్య సమయంలో ఒత్తిళ్లను అధిగమించేందుకు స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదాగా గడపాలన్నారు. సమస్య వచ్చినప్పుడు తోటి వారితో పంచుకుంటే పరిష్కారం లభిస్తోందని అభిప్రాయపడ్డారు. కౌన్సిల్ మాజీ ప్రధాన కార్యదర్శి బి.పి.దుబే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రొఫెసర్ జి. సురేందర్‌రెడ్డి, కౌన్సిల్ అధ్యక్షులు మానిక్‌రావు పటేల్, కార్యదర్శి ప్రసాద్, మానవ సేవా సమితి ప్రతినిధి జెస్టి శాయి,టీఎస్‌ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓయూలో మహాదీక్ష



టీఎస్‌పీఎస్సీ అక్రమాలను నిరసిస్తూ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఓయూలో వామపక్ష విద్యార్థుల ఆధ్వర్యంలో మహాదీక్ష చేపట్టారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని వామపక్ష నేతలతో పాటు కాంగ్రెస్ నేత మానవతరాయ్, ఓయూ ప్రొ.కాశీం తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. –ఉస్మానియా యూనివర్సిటీ